సాక్షి అనకాపల్లి
బుధవారం । 30 । ఆగస్టు । 2023



పూర్తి స్థాయిలో రహదార్లు

రూ.1.35 కోట్లతో చేపడుతున్న రహదారుల నవీకరణ పనులకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ శంకుస్థాపన చేశారు.
8లో



స్టార్టప్ సెంటర్ సందర్శన

విశాఖ: ఏయూలోని స్టార్టప్, ఇంక్యుబేషన్ సెంటర్‌ను లెఫ్టినెంట్ జనరల్ ఎస్.ఎస్.రాజ సుబ్రమణి మంగళవారం సందర్శించారు.

వర్షసూచన



అనకాపల్లిటౌన్: రాగల ఐదు రోజులు ఓ మోస్తరు వర్షసూచన ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి మంగళవారం పేర్కొన్నారు. ఈ నెల 30న 3, 31న 8, సెప్టెంబర్ 1న 25, 2న 34, 3న 30 మి.మీ. చొప్పున వర్షం కురిసే అవకాశం ఉందని చెప్పారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి దివ్యాంగ బాలల జిల్లా స్థాయి క్రీడలు

చోడవరం రూరల్: అనకాపల్లి జిల్లా విద్యాశాఖ, ఏపీ సమగ్ర శిక్ష, రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖ సెంటీనియల్ సమన్వయంతో బుధవారం నుంచి జిల్లా స్థాయి దివ్యాంగ బాల బాలికల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. చోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉదయం 8 గంటలకు పోటీలు ప్రారంభం కానున్నాయన్నారు. జూనియర్, సీనియర్ కేటగిరీల్లో బుద్ధి మాంద్యం, వినికిడి, దృష్టిలోపం, దివ్యాంగ బాలలకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. రన్నింగ్, షార్ట్‌పుట్, సాఫ్ట్ బాల్, స్లో వాకింగ్, డిస్కస్ త్రో, లాంగ్ జంప్, జావలిన్ త్రో, అసిస్టెడ్ వాక్ తదితర క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జెడ్పీ యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న 6 నుంచి 18 ఏళ్ల లోపు వయసున్న దివ్యాంగ బాలలు పాల్గొనవచ్చన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన విద్యార్థులు తప్పనిసరిగా సదరం ధ్రువపత్రాలు, ఆధార్ జిరాక్స్ ప్రతుల్ని వెంట తీసుకురావాలని సూచించారు.

ఎంపీ నిధులతో బాలుడికి వినికిడి యంత్రం



మనోజ్‌కుమార్‌కు వినికిడి యంత్రాన్ని అందజేస్తున్న ఎంపీ డాక్టర్ సత్యవతి

కశింకోట: వినికిడి సమస్యతో బాధ పడుతున్న బయ్యవరం గ్రామానికి చెందిన బాలుడికి రూ.5 లక్షల ఎంపీ నిధులతో సమకూర్చిన వినికిడి యంత్రాన్ని మంగళవారం ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి అందజేశారు. బయ్యవరంలోని బోదిపి మాధవరావు, మోహిని దంపతుల కుమారుడైన 11 ఏళ్ల మనోజ్‌కుమార్ పుట్టుకతోనే బధిరుడు. వైద్యులు సాధారణ వినికిడి పరికరాన్ని అమర్చినా సరిగ్గా పనిచేయక ఇబ్బందులను ఎదుర్కొన్నాడు. మెరుగైన వినికిడి యంత్రం అవసరం కావడంతో తల్లిదండ్రులు ఎంపీ సత్యవతిని కలిసి సమస్య విన్నవించారు. స్పందించిన ఎంపీ తన అభివృద్ధి నిధులతో వినికిడి యంత్రాన్ని అందజేశారు. ఎంపీపీ కలగా లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, అనకాపల్లి జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేటి నుంచి మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు



అభ్యర్థి కొలతలు తీస్తున్న అధికారులు

ఆరిలోవ: విశాఖ రేంజ్ పరిధిలో ఎస్ఐ ఉద్యోగాల నియామకాల కోసం బుధవారం నుంచి మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నారు. కైలాసగిరి ఏఆర్ పోలీస్ మైదానంలో ఈ నెల 25 నుంచి పరీక్షలు జరుగుతున్న విషయం తెలిసిందే. మంగళవారం పురుష అభ్యర్థులకు పరీక్షలు చేశారు. రేంజ్ పోలీస్ అధికారులు 800 మంది అభ్యర్థులకు హాల్ టిక్కెట్లు పంపగా వారిలో 589 మంది హాజరయ్యారు. వారికి పరుగు, లాంగ్ జంప్, కొలతలు తీసి, సర్టిఫికెట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి సెప్టెంబరు 2 వరకు మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వారి కోసం ఇక్కడ ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశామన్నారు. 2,745 మంది మహిళా అభ్యర్థులకు నాలుగు రోజులపాటు పరీక్షలు జరుపుతామన్నారు. పరీక్షలను డీఐజీతోపాటు అనకాపల్లి ఎస్పీ కె.వి. మురళీకృష్ణ తదితరులు పర్యవేక్షించారు.

నేడు తాండవ రైతులతో అత్యవసర సమావేశం

నాతవరం: తాండవ రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో ఉన్న రైతులతో బుధవారం నాతవరం ప్రాజెక్టు కార్యాలయంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశామని ప్రాజెక్టు డీఈ జె.స్వామినాయుడు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురవకపోవడంతో ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గిపోతోందన్నారు. ఇప్పుడున్న నీటిమట్టం శివారు ఆయకట్టు భూములకు ప్రవహించదన్నారు. అందుచేత ముందస్తుగా రైతులు, ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి వారి అభీష్టం మేరకే తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు.

ఉప్పొంగిన క్రీడా స్ఫూర్తి



దిబ్బిడిలో జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

జిల్లా అంతటా జాతీయ క్రీడా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ఇచ్చారు. బుచ్చెయ్యపేట మండలం దిబ్బిడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు 225 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ జరిపారు. హైస్కూల్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా గ్రామంలో ఉన్న జాతిపిత మహాత్మగాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. హెచ్ఎం కె.సత్యారావు, సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, పీఈటీ కిరణ్‌కుమార్ పలు క్రీడల్లో రాణించిన క్రీడాకారుల గురించి వివరించి విద్యార్థులకు స్ఫూర్తి కలిగించారు. కోటవురట్ల మండలం పాములవాక హైస్కూల్లో నేషనల్ స్పోర్ట్స్ డే ఆకృతిలో విద్యార్థులు చేసిన అక్షర విన్యాసం అలరించింది.

– కోటవురట్ల/బుచ్చెయ్యపేట



పాములవాకలో 'నేషనల్ స్పోర్ట్స్ డే' ఆకృతిలో విద్యార్థుల ప్రదర్శన



కోటవురట్ల కేజీబీవీలో విద్యార్థినుల పిరమిడ్ విన్యాసాలు

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం



అనకాపల్లిలో జాతీయ క్రీడా దినోత్సవ ర్యాలీ

తుమ్మపాల: పాఠశాల విద్యార్థి దశలోనే క్రీడలను ప్రోత్సహించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పట్టణంలో ఎన్టీఆర్ గ్రౌండ్ నుంచి 4 రోడ్ల జంక్షన్ వరకు క్రీడాకారులు, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం ప్రభుత్వం అందిస్తుందన్నారు. డీఈవో వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ ఈ ఏడాది క్రీడా దినోత్సవ కార్యక్రమాలను 'సమష్టి, యోగాసనాల కోసం క్రీడలు సహాయపడతాయి' అనే థీమ్‌తో నిర్వహించినట్టు చెప్పారు. వాలీబాల్, 100 మీటర్ల రేస్, హాకీ, లెమన్ అండ్ స్పూన్, టగ్ ఆఫ్ వార్ వంటి క్రీడా పోటీలను పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించామన్నారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులను కలెక్టర్ సత్కరించారు. స్పోర్ట్స్ ఆథారిటీ బోర్డు మెంబర్ జె.శ్రీనివాసరావు, ఎస్‌జీఎఫ్ఏపీ ఎం.నాగేశ్వరరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



అవార్డు తీసుకుంటున్న ఎస్.రాయవరం హైస్కూల్ హెచ్ఎం ఎం.సత్యనారాయణ

అన్నదాతకు అండగా.. కల్తీకి చెక్

ఆరుగాలం శ్రమించే అన్నదాతలు నకిలీ ఎరువులు.. విత్తనాలతో దగా పడుతున్నారు. రూ.వేలల్లో పెట్టుబడులు పెట్టి నిలువునా అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల నుంచి రైతులకు అండగా ఉండాలని ప్రభుత్వం సంకల్పించింది. నకిలీల బాధ నుంచి రైతులకు విముక్తి కలిగించేందుకు నిర్ణయం తీసుకుంది. ప్రతి రైతుకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందాలనే లక్ష్యంతో వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను తీసుకువచ్చింది.

- జిల్లాలో ఆరు అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు
- నాణ్యమైన విత్తనాలు, ఎరువులే లక్ష్యం
- రైతులకు ఉచితంగా నాణ్యత పరీక్షలు



నర్సీపట్నంలోని వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్



విత్తనాల నాణ్యతను పరీక్షిస్తున్న అనలిస్టులు

జిల్లాలో సాగు రైతుల సంఖ్య : **3,05,600**

సాగు విస్తీర్ణం (హెక్టార్లలో) : **59,800**

వైఎస్సార్ అగ్రిల్యాబ్‌ల సంఖ్య **6**

ప్రాంతాలు : నర్సీపట్నం, అనకాపల్లి, పాయకరావుపేట, చోడవరం, జి.మాడుగుల, యలమంచిలి

పరీక్షించిన నమూనాల సంఖ్య
ఎరువుల శాంపిల్స్ : 488
విత్తనాల శాంపిల్స్ : 952

మాకవరపాలెం: వ్యవసాయం దండగ కాదు.. పండగ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం రైతులకు ఎన్నో పథకాలను ప్రవేశపెట్టింది. ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రైతులను ఎంతో ప్రోత్సహిస్తోంది. ఇన్ని చేస్తూ... రైతన్నకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందాలనే ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గానికి ఒక అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. సుమారు రూ.కోటి 30 లక్షల వరకు ఖర్చు చేసి దేశంలోనే ఎక్కడాలేని విధంగా ఈ ల్యాబ్‌ల ద్వారా రైతులకు ఉచితంగా నాణ్యత నిర్ధారణ పరీక్షలు చేస్తోంది. ప్రభుత్వం సరఫరా చేసే విత్తనాలు, ఎరువులే కాకుండా మార్కెట్‌లో దుకాణాల్లో కొనుగోలు చేసే వాటిని సైతం ఈ ల్యాబుల్లో ఉచితంగా పరీక్షలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

పక్కాగా నాణ్యత నిర్ధారణ పరీక్షలు

జూలై 2021న ప్రారంభించిన అగ్రి ల్యాబ్‌ల ద్వారా విత్తనాలు, ఎరువుల నాణ్యతపై పక్కాగా నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాల నాణ్యతపై సందేహాలుంటే ఈ ల్యాబుల్లో ఉచితంగా పరీక్షలు చేయించుకోవచ్చు. గతంలో పరీక్షలు చేసి రిపోర్టులు రావాలంటే నెలకుపైగా సమయం పట్టేది. కానీ ఈ ల్యాబుల్లో కేవలం విత్తనాల నిర్ధారణకు పది రోజులు, ఎరువుల నిర్ధారణకు మూడు రోజులు మాత్రమే సమయం పడుతోంది. ఈ నేపథ్యంలో తక్కువ వ్యవధిలో పరీక్షలు చేయించుకున్న రైతన్నలు ఎంతో ధీమాగా వ్యవసాయం చేస్తున్నారు.

మూడు విడతల్లో పరీక్షలు..

కల్తీ, నకిలీ విత్తనాలు, ఎరువులను నిరోధించేందుకు మూడు విడతల్లో నాణ్యత పరీక్షలు చేపడతారు. ప్రధానంగా ఎరువుల దుకాణాల్లో విక్రయాలు చేసే కల్తీ ఎరువులు, విత్తనాలకు ఈ అగ్రి ల్యాబుల్లో నాణ్యత నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం వాటిని మార్కెట్‌లోకి విడుదల చేస్తారు. జిల్లాస్థాయిలో చేపట్టిన పరీక్షల్లోనూ నాణ్యత సంతృప్తికరంగా ఉంటే సర్టిఫికెట్ జారీ చేస్తారు. లేని పక్షంలో కంపెనీలపై చర్యలకు వెనుకాడబోరు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఈ అగ్రి ల్యాబుల్లో ఇద్దరు జూనియర్ అనలిస్టులు, ఒక అఫీషియల్ అనలిస్టు చొప్పున నియమించారు. వీరి పనితీరును ఏడీ పర్యవేక్షిస్తారు.

మంచి ధర వచ్చింది



నేను గతేడాది బ్లాక్‌రైస్ సాగు చేశాను. ఈ పంటను విత్తనాలుగా అమ్మకాలు చేసేందుకు నాణ్యత కోసం వైఎస్సార్ అగ్రిల్యాబ్‌లో పరీక్ష చేయించాను. నాణ్యత బాగుందని నివేదిక వచ్చింది. నేను విక్రయించిన విత్తనాలకు ఆశించినదానికంటే అధిక ధర వచ్చింది.

-బి.అప్పలసత్యనారాయణ, రైతు, అప్పలరాజుపేట

ముందస్తు పరీక్షలతో మేలు



విత్తనాలు, ఎరువుల నాణ్యత తెలుసుకునేందుకు అగ్రి ల్యాబ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయి. తేమ, మొలక శాతం పరీక్షలు సమర్థవంతంగా పరీక్షిస్తాం. ముందస్తు పరీక్షలతో రైతులు పంటల సాగుకు ఇబ్బందులు పడే అవకాశం ఉండదు.

-జి.సుగుణ, అఫీషియల్ అనలిస్ట్, నర్సీపట్నం ల్యాబ్

రైతులకు ఉచితం



సాగు రైతులు తీసుకువచ్చిన ఎరువులు, విత్తనాలను ఉచితంగా ల్యాబ్‌లో నాణ్యత పరీక్షలు చేస్తాం. ఎరువుల దుకాణాల డీలర్లు, ఇతరులు తీసుకువచ్చిన వాటికి ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించాలి. నిర్ధారణ ఫలితాలను పది రోజుల్లో వెల్లడిస్తాం.

-శ్రీదేవి, ఏడీఏ, నర్సీపట్నం

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ అగ్రి ల్యాబ్‌లను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. విత్తనాలు, ఎరువుల నాణ్యత పరీక్షలు చేయించుకునేందుకు రైతు భరోసా కేంద్రాల సిబ్బందిని సంప్రదించవచ్చు. వారి ద్వారా నాణ్యత నిర్ధారణ పరీక్షలు చేయిస్తాం.

-మోహన్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి, అనకాపల్లి

తెలుగు వెలుగు

మాకవరపాలెం: తూటిపాలలో సంప్రదాయ దుస్తుల్లో హాజరైన విద్యార్థులు, ఉపాధ్యాయులు



కలశంతో తెలుగు మాత.. చేతిలో పచ్చని పైరు.. సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినీ విద్యార్థులు.. వారికి మార్గదర్శకులుగా అయ్యవార్లు.. చదువులమ్మ చెట్టునీడలో ఈ దృశ్యం ఎంతో మనోహరంగా ఉంది కదూ.. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తూటిపాల యూపీ స్కూల్లో ఈ వేడుక నిర్వహించారు. హెచ్ఎం కె.రాము ఆధ్వర్యంలో తెలుగుదనం ఉట్టిపడేలా విద్యార్థులు నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. జిల్లా అంతటా తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

– మాకవరపాలెం

గిడుగుకు ఘన నివాళి



గిడుగు రామమూర్తికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

తుమ్మపాల: తెలుగు భాషకు ఎనలేని సేవలందించిన భాషా సంస్కర్త గిడుగు రామ్మూర్తికి కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఘనంగా నివాళులర్పించారు. కలెక్టర్ కార్యాలయంలో గిడుగు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఆ మహనీయుని చిత్రపటానికి కలెక్టర్, జేసీ ఎం.జాహ్నవి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఐఆర్‌సీటీసీ ప్రత్యేక టూర్స్ ప్యాకేజీ

తాటిచెట్లపాలెం : పుణ్యక్షేత్రాలు సందర్శించాలనుకునే భక్తులు, యాత్రికుల కోసం ప్రత్యేక విమాన ప్యాకేజీలను ప్రవేశపెట్టినట్లు ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ చంద్రమోహన్ బిసా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

సదరన్ డివైన్ టెంపుల్ టూర్ : సెప్టెంబరు 15న విశాఖపట్నంలో ప్రారంభమై 20న విశాఖలోనే ముగుస్తుంది. ఈ టూర్‌లో దక్షిణ భారతదేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన మధురై మీనాక్షి అమ్మన్ గుడి, రామేశ్వరంలోని రామనాథస్వామి ఆలయం, ధనుష్కోటి, కన్యాకుమారి, వివేకానంద రాక్ మెమోరియల్, త్రివేంద్రంలోని అనంత పద్మనాభ స్వామి ఆలయాలను సందర్శించవచ్చు. ఈ టూర్‌లో ఒకొక్కరికి రూ.45,900/- (సింగిల్ ఆక్యుపెన్సీ), రూ.35,875/- (డబుల్ ఆక్యుపెన్సీ), రూ.34,480/-(ట్రిబుల్ ఆక్యుపెన్సీ) అవుతుంది.

చార్‌ధామ్ యాత్ర : అక్టోబరు 16న విశాఖపట్నంలో ప్రారంభమై 27న విశాఖలో ముగుస్తుంది. ఈ టూర్‌లో హరిద్వార్, బార్‌కోట్, జంకిచట్టి, యమునోత్రి, ఉత్తర కాశీ, గంగోత్రి, గుప్త కాశీ, సోన్‌ప్రయాగ్, కేదార్‌నాథ్, బద్రీనాథ్ వంటి పుణ్యక్షేత్రాలను దర్శించవచ్చు. ఒకొక్కరికి రూ. 86,320/-(సింగిల్ ఆక్యుపెన్సీ), రూ.58,820/-(డబుల్ ఆక్యుపెన్సీ), రూ.53,630/-(ట్రిబుల్ ఆక్యుపెన్సీ)కి వసూలు చేస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్రవేశ ద్వారం వద్ద గల ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో స్వయంగా, లేదా 0891-2500695, 82879 32318, 92814 95847లో సంప్రదించాలని చంద్రమోహన్ కోరారు.

ఖాజీపాలెంలో క్యాన్సర్ ల్యాబ్

- పైలట్ ప్రాజెక్టును ప్రారంభించిన ఎంపీ, కలెక్టర్
- అవగాహన కార్యక్రమాలు, స్క్రీనింగ్ టెస్టుల కోసం ఏర్పాటు



ఖాజీపాలెంలో క్యాన్సర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎంపీ సత్యవతి

అచ్యుతాపురం(అనకాపల్లి): క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన, స్క్రీనింగ్ కోసం అనకాపల్లి జిల్లాను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినట్లు ఎంపీ డాక్టర్ సత్యవతి తెలిపారు. అచ్యుతాపురం మండలంలోని ఖాజీపాలెంలో క్యాన్సర్ స్క్రీనింగ్, అవగాహన ల్యాబ్‌ను కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టితో కలిసి ఆమె మంగళవారం ప్రారంభించి, మాట్లాడారు. రాష్ట్రంలో క్యాన్సర్‌పై అవగాహన పెంచేందుకు పైలట్ ప్రాజెక్టులో భాగంగా అనకాపల్లి తిరుపతిలను ఎంపిక చేసినట్లు తెలిపారు. అగనంపూడిలోని హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి రీసెర్చి సిబ్బంది, ఇక్కడి ల్యాబ్‌లో క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మాట్లాడుతూ ఖాజీపాలెంలో ఏర్పాటు చేసిన ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహిస్తూ, పరీక్షా ఫలితాల ఆధారంగా అవసరమనుకుంటే అగనంపూడి క్యాన్సర్ ఆస్పత్రికి పంపిస్తారని వెల్లడించారు. ఇక్కడి వైద్య పరీక్షలపై ప్రజల స్పందన, ఫలితాల మేరకు జిల్లాలో మరికొన్ని చోట్ల ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. క్యాన్సర్‌పై ప్రజల్లో మరింత చైతన్యం రావాల్సి ఉందన్నారు. అందుకే ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఇటువంటి ల్యాబ్‌లను ఏర్పాటు చేసిందన్నారు. డీఎంహెచ్‌వో హేమంత్ మాట్లాడుతూ ఈ ల్యాబ్‌లో క్యాన్సర్‌కి సంబంధించిన అన్ని పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమర వర్మ, ప్రోగ్రాం ఆఫీసర్ జ్యోతి, అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి, స్థానిక వైద్యాధికారులు రజని, కల్యాణి, ఎంపీపీ కోన సంధ్య, పీలా నర్సింగరావు, పిన్నమరాజు వాసు, కోన బుజ్జి పాల్గొన్నారు.

ఉమాగాంధీ అందరికీ ఆదర్శం



ఉమాగాంధీని సత్కరిస్తున్న మేయర్

అల్లిపురం (విశాఖ): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన డాక్టర్ మురహరిరావు ఉమాగాంధీ సహ ఉపాధ్యాయులందరికీ ఆదర్శనీయురాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. ఈ మేరకు ఆమెను నగర మేయర్, జీవీఎంసీ అదనపు కమిషనర్, ఉప విద్యాశాఖ అధికారి డి.శ్రీనివాసరావు మంగళవారం సత్కరించి అభినందించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ శివాజీపాలెంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న ఉమాగాంధీ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక కావడం విశాఖకి గర్వకారణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యమిస్తోందని, ఇటువంటి ఉపాధ్యాయులు మన పాఠశాలలో పని చేయడం అదృష్టంగా భావించాలన్నారు.

తల్లి నేత్రాలు దానం చేసిన తనయులు

రావికమతం: సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు పెద్దలు. ఆ కుమారులకు మాత్రం తమ అమ్మ నిరంతరం తమకు బోధించిన మాటలే గుర్తున్నాయి. బతికి ఉన్నా, మరణించినా నలుగురికీ ఉపయోగపడాలిరా.. అదీ బతుకంటే అని చెప్పిన తల్లి ఆశయాన్ని ఆ పుత్రులు నెరవేర్చారు. మరణానంతరం ఆమె కళ్లను దానం చేసి, అమ్మ చూపిన బాటలో నడిచారు. మేడివాడ గ్రామానికి చెందిన కొనగళ్ల రాజారత్నం(70) మంగళవారం సహజ మరణం చెందారు. దీంతో ఆమె కుమారులు సురేష్, రాము, లక్ష్మణరావులు పుట్టెడు దుఃఖంలోనూ తల్లి నేత్రాలను దానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఆర్యవైశ్య కుటుంబంలో జన్మించిన రాజా రత్నం ఆది నుంచీ పదుగురికి సాయపడుతూ వచ్చారు. సేవా ధర్మమే తమను రక్షిస్తాయని నమ్మేవారు. ఆమె కుమారులకూ ఆదే చెబుతూ వచ్చే వారు. మరణానంతరం మరొకరికి ఉపయోగపడే పనిచేయాలని తరచూ కుమారులతో చెబుతూ వచ్చేది. మంగళవారం ఆమె సహజమరణం చెందగా, తల్లికోరిక మేరకు ఆమె నేత్రాలను దానం చేసేందుకు విశాఖ ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రిని సంప్రదించారు. అక్కడి వైద్యులు వచ్చి ఆమె నేత్రాలను సేకరించి వెళ్లారు. శోకంలోనూ మరో ఇద్దరికి చూపునివ్వాలన్న ఆ కుమారుల గొప్పతనాన్ని వైద్యుల తోపాటు, గ్రామస్తులు కొనియాడారు.



రాజారత్నం నేత్రాలు సేకరిస్తున్న వైద్యులు

80 కిలోల గంజాయితో ఇద్దరు అరెస్టు

పరారైన నిందితుడి కోసం గాలింపు



పట్టుబడిన గంజాయిని చూపుతున్న పోలీసులు

చీడికాడ: అక్రమంగా గంజాయి తరలిస్తున్న నిందితులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి 80 కిలోల గంజాయిని పట్టుకున్నామని ఎస్ఐ పి.రామారావు మంగళవారం తెలిపారు. మండలంలోని జి.కొత్తపల్లి కూడలి వద్ద ఉదయం తమ సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా, బైలపూడికి చెందిన ముగ్గురు నిందితులు రెండు ద్విచక్ర వాహనాలపై నాలుగు మూటలతో గంజాయి తరలిస్తున్నట్టు గుర్తించామన్నారు. గొల్లవిల్లి గణేష్, గొల్లవిల్లి నీల కంఠేశ్వరరావులను పట్టుకోగా, మరో నిందితుడు మూటను విడిచిపెట్టి పరారైనట్టు తెలిపారు. మొత్తం నాలుగు మూటల్లో 80 కిలోల గంజాయితో పాటు ఒక బైకు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారైన వ్యక్తి కోసం గాలిస్తున్నట్టు తెలిపారు.

డిప్యూటీ సీఎంను కలిసిన దంతులూరి



ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దిలీప్‌కుమార్‌ను అభినందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

దేవరాపల్లి: ఆంధ్రప్రదేశ్ ఇన్‌లాండ్ వాటర్ వేస్ (ఏపీఐడబ్ల్యూఏ) నూతన చైర్మన్‌గా నియమితులైన దంతులూరి దిలీప్‌కుమార్ మంగళవారం దేవరాపల్లి మండలం తారువ క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం నూతన చైర్మన్‌ను డిప్యూటీ సీఎం సత్కరించి అభినందించారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి మండల నాయకులు ఉల్లారి చంద్రశేఖర్, దంతులూరి కళ్యాణచక్రవర్తి, మండల కార్యదర్శి ఆడారి సూరిబాబు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీలో స్వర్ణం



విద్యార్థి రోహిత్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

కశింకోట: స్థానిక సెయింట్ జాన్స్ స్కూలు విద్యార్థి ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్‌షిప్ పోటీలో ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకాన్ని సాధించాడు. ఈ స్కూలులో నాలుగో తరగతి చదువుతున్న ఆడారి రోహిత్ అండర్ -12 కటా విభాగంలో విజేతగా నిలిచాడు. ఈ మేరకు విద్యార్థితోపాటు కరాటే కోచ్ సిహెచ్. సూరిఅప్పారావులను ప్రిన్సిపాల్ రూపానంది, అకడమిక్ ఇన్‌చార్జి పి. చంద్రమౌళి తదితరులు మంగళవారం అభినందించారు.

కందిరీగల దాడిలో రైతుకు గాయాలు



రాములయ్యను 108లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

రావికమతం: మండలంలోని గుమ్మాళ్లపాడుకు చెందిన రైతు బంటు రాములయ్యకు కందిరీగల దాడిలో తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం తన పశువుల పాకకు సమీపంలో పశుగ్రాసం కోస్తుండగా అక్కడ పుట్టలోంచి ఒక్కసారిగా కందిరీగలు బయటకు వచ్చి అతడిపై దాడి చేసి గాయపర్చాయి. దాంతో కేకలు వేయగా బంధువులు 108 వాహనానికి సమాచారం అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హుటాహుటిన నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఎన్‌సీసీతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి



కళాశాల ఆవరణలో ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రదర్శన

అచ్యుతాపురం(అనకాపల్లి): ఎన్‌సీసీ క్యాడెట్‌గా శిక్షణ పొందటం ద్వారా విద్యార్థి దశలోనే క్రమశిక్షణ, స్వీయరక్షణ, దేశభక్తి అలవడుతుందని ఆంధ్రా, తెలంగాణ ఎన్‌సీసీ నౌసైనిక్ ఇంటర్ గ్రూప్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమాండర్ వీఎం రెడ్డి అన్నారు. అచ్యుతాపురం మండలంలోని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న ఆంధ్ర, తెలంగాణ నౌసైనిక్ ఎన్‌సీసీ షిప్ బిల్డింగ్, ఫైరింగ్, సెయిలింగ్ క్యాంప్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. 1948 నుంచి ద్వితీయ శ్రేణి రక్షణ రంగం కోసం ఎన్‌సీసీ నౌసైనిక్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంప్‌లో ప్రతిభ కనబరచిన వారిని నౌసైనిక్, రిపబ్లిక్ డే క్యాంప్‌లకు ఎంపిక చేస్తామన్నారు. ఏపీ, తెలంగాణకు చెందిన 300 మంది క్యాడెట్లు ఈ క్యాంప్‌లో పాల్గొన్నారు.

● ఎకో వాక్ @ బీచ్‌రోడ్డు





ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, జీవీఎంసీ ఆధ్వర్యంలో మంగళవారం బీచ్‌రోడ్డులో నిర్వహించిన ఎకో వైజాగ్ వాక్‌కు విశేష స్పందన లభించింది. ఆర్.కె బీచ్ వద్ద కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ వాక్‌ను నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కలెక్టర్ ఎ.మల్లికార్జున, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సభ్యులతో కలిసి బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ ప్రారంభించారు. వాక్ అనంతరం వైఎంసీఏ వద్ద ఏర్పాటు చేసిన సభలో పర్యవరణం పరిరక్షణకు సహకరించాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏసీఏ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథ్ రెడ్డి, జేసీ విశ్వనాథన్, అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి పురుషోత్తం, క్రికెట్ ఆటగాడు కె.ఎస్ భరత్, నగర పౌరులు పాల్గొన్నారు. – ఆరిలోవ





ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, మేయర్ హరి వెంకటకుమారి, కలెక్టర్ మల్లికార్జున, పాల్గొన్న నగరవాసులు

పూర్తి స్థాయిలో గ్రామీణ రహదారుల నిర్మాణం

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ
- రూ. 1.35 కోట్లతో రెండు రోడ్లు పనులకు శంకుస్థాపన



చోడవరం-లక్ష్మీపురం, దామునాపల్లి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం : గ్రామీణ రహదారులన్నీ పూర్తి స్థాయిలో నిర్మాణాలు చేసేందుకు అన్ని చర్యలు చేపట్టామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరం మండలంలో గత కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోక ప్రయాణికులకు ఇబ్బందిగా మారిన చోడవరం-లక్ష్మీపురం, దామునాపల్లి రోడ్డు, అంబేరుపురం- రాయపురాజు పేట రోడ్డు పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. రూ. కోటి 35లక్షల నిధులు ఈ రెండు రోడ్డు పనులకు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో రోడ్లకు ఎటువంటి మరమ్మతులు చేపట్టలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో 50 శాతం రోడ్లను నవీకరణ చేపట్టామన్నారు. లక్ష్మీపురం, రాయపురాజుపేట రోడ్లను కూడా నవీకరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. లక్ష్మీపురం రోడ్డుకు రూ. 52.60లక్షలు, రాయపురాజుపేట రోడ్డుకు రూ. 82.73 లక్షలు మంజూరయ్యాయని ధర్మశ్రీ చెప్పారు.

ముఖ్యమంత్రి నియోజకవర్గంలో ప్రధాన లింకు రోడ్ల నిర్మాణానికి సుమారు రూ. 28 కోట్లు మంజూరు చేశారని ధర్మశ్రీ చెప్పారు. ఇప్పటికే పలు రోడ్లు నిర్మాణం చేశామని, మిగతా రోడ్ల నిర్మాణానికి కూడా టెండర్లు పిలిచి పనులు చేపట్టామన్నారు. త్వరలో రహదారి సమస్య తీరుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యారావు, డీసీఎంఎస్ చైర్మన్ నర్సింగరావు, వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు, బుద్ద గంగరాజు, సర్పంచ్‌లు నూకాలమ్మ, గణపతినాయుడు, బలిరెడ్డి నాగేశ్వరరావు, శానాపతి రాజశేఖర్, ఈశ్వరమ్మ, శీరంరెడ్డి వెంకటరమణ, దంతులూరి శ్రీనివాసరాజు, మొల్లి ఈశ్వరరావు, ఎంపీటీసీల మాజీ ఫ్లోర్‌లీడర్ సూరిశెట్టి నాగదుర్గ గోవింద, ఎంపీటీసీ శరగడం నాగేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బొడ్డేడ సూర్యనారాయణ, వైస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, మండల బీసీ సెల్ అధ్యక్షుడు సోమునాయుడు పాల్గొన్నారు.

గిరిజనుల స్థితిగతులపై ట్రైనీ ఐఏఎస్‌ల అధ్యయనం



గిరిజనులతో ఫోటో దిగిన ట్రైనీ ఐఏఎస్‌ల బృందం

సీలేరు: ట్రైనీ ఐఏఎస్‌ల బృందం జిల్లాలో మారుమూల దుప్పులవాడ పంచాయతీలోని గ్రామాల్లో మంగళవారం పర్యటించింది. అక్కడి గిరిజనుల స్థితిగతులు, జీవన శైలి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఎలా చేరుతున్నాయి అన్న విషయాలను అధ్యయనం చేసేందుకు ఏడుగురు సభ్యుల బృందం మూడు రోజుల పాటు పర్యటించనుంది. మొదటి రోజు నడిమిగుడ, బందవీధి, రాంపు, రేవళ్లమడుగు, రష్యాగుడ గ్రామాలకు వెళ్లిన ట్రైనీ ఐఏఎస్‌లు గ్రామస్తులతో మమేకమయ్యారు. వారి నుంచి పంటల సాగు వివరాలు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న వైద్యం, తాగునీరు, రహదారి సౌకర్యం, ఇళ్ల నిర్మాణం, గంజాయి సాగు, దాని వల్ల వచ్చే అనర్థాలు, ప్రత్యామ్నాయ పంటలు సాగు తదితర వివరాలు సేకరించారు. వారి వెంట మండల విస్తరణాధికారి పాపారావు, సెక్రటరీ వెంకటరావు, సర్పంచ్ కేలేపు కుమారి, మండల సీడీపీవో లక్ష్మి ఉన్నారు.



గిరిజనుల నుంచి వివరాలు సేకరిస్తున్న ట్రైనీ ఐఏఎస్

ఎస్సీలకు భూములపై సంపూర్ణ హక్కులు

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామారావు



భూ హక్కుపై లబ్ధిదారులకు వివరిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామారావు

నాతవరం: భూమి కొనుగోలు పథకంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 60 మంది ఎస్సీలకు ఇచ్చిన భూములకు పూర్తి హక్కులు ప్రభుత్వం కల్పిస్తుందని ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ) కె.రామారావు తెలిపారు. మండలంలోని వల్సంపేట రెవెన్యూ పరిధిలో దివంగత మహానేత వైఎస్సార్ 2005లో కొనుగోలు చేసి ఎస్సీలకు అందించిన భూములు ఆయన స్వయంగా పరిశీలించారు. సాగు చేస్తున్న దళితులతో మాట్లాడారు. తహసీల్దార్ ఎస్ఎస్‌వీ శ్రీనివాస్‌నాయుడును కార్యాలయంలో కలిసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్సీలకు ఇచ్చిన భూమిని జీవో నెం.51 ప్రకారం శాశ్వత హక్కు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ భూముల రైతులకు ప్రకృతి వ్యవసాయం సాగుపై జిల్లా ప్రాజెక్టు అధికారి అధ్వర్యంలో అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో చేయూత పథకం ద్వారా ఎస్సీ లబ్ధిదారులను ఆర్థికంగా అదుకుంటున్నామన్నారు. కార్పొరేషన్ నిధులతో చిన్న తరహా పరిశ్రమల స్థాపనలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సాహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చైస్లు, కార్పొరేషన్ అధికారి భాస్కర్, వల్సంపేట వీఆర్వో బాబ్జి, చమ్మచింత హాస్టల్ వార్డెన్ మల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

యువతి మృతికి కారణమైన ఇద్దరికి రిమాండ్

మర్రిపాలెం: ప్రేమ పేరుతో ఓ యువతిని ప్రలోభపెట్టి ఆమె మృతికి కారణమైన ఇద్దరు యువకులను రిమాండ్‌కు తరలించినట్టు కంచరపాలెం పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఘటనకు సంబంధించి పోలీసుల వివవరాలిలా ఉన్నాయి...నర్సీపట్నానికి చెందిన యువతి నున్నం మాధురి (21) సెయింట్ జోసెఫ్ కళాశాలలో హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ చదువుతోంది. నర్సీపట్నంకు చెందిన అరుణ్ కుమార్‌తో ప్రేమలో పడింది. ఇదిలావుండగా అల్లూరి సీతారామరాజు జిల్లా కొత్తగూడెంకు చెందిన సాయి గణేష్ కూడా మాధురి ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని పదేపదే వేధించేవాడు. ఈ క్రమంలో గణేష్ ప్రేమను మాధురి నిరాకరించింది. కక్ష పెంచుకున్న గణేష్..మాధురి ప్రియుడు అరుణ్‌తో పరిచయం పెంచుకున్నాడు. యువతిపై లేనిపోని మాటలు చెప్పడంతో మాధురి..అరుణ్ మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. దీంతో వేదన తట్టుకోలేక ఫిబ్రవరి 2న కళాశాలలో ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో విచారణ చేపట్టిన కంచరపాలెం ఎస్ఐ దివ్యభారతి వాస్తవాలను తెలుసుకున్నారు. ఘటనకు కారణమైన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

మితిమీరిన వేగంతో...

- అనకాపల్లి-ఆనందపురం హైవేలో రాంపురం వద్ద వ్యాన్‌ని ఢీకొన్న కారు
- ఒకరు మృతి, నలుగురికి తీవ్రగాయాలు
- యానాం నుంచి వస్తుండగా ఘటన



సంఘటనస్థలంలో కారులో ఇరుక్కుపోయిన సూర్యభగవాన్ మృతదేహం



ప్రమాదంలో నుజ్జు అయిన కారు, పరిశీలిస్తున్న పెందుర్తి ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ తదితరులు

సింహాచలం: అనకాపల్లి-ఆనందపురం హైవేలో పెందుర్తి మండలం రాంపురం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ముందు వెళ్తున్న వ్యాన్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టిన ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పెందుర్తి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యానాంకి చెందిన దొమ్మేటి సూర్యభగవాన్(27), రేవు పవన్‌కుమార్(27), గెద్దం సురేష్(27), వేలంగి సాయికృష్ణ(28), రాజ్‌కుమార్(28) కారులో సోమవారం యానాం నుంచి విశాఖకు బయలుదేరారు. వీరిలో పవన్‌కుమార్ విశాఖలో ఎల్‌డీసీ పరీక్షకు హాజరుకావాల్సి ఉంది. పరీక్ష అనంతరం అందరూ కలిసి అరకు, విశాఖలోని పలు ప్రాంతాలు చూడాలని భావించారు. సోమవారం రాత్రి 9.30 గంటల సమయంలో అనకాపల్లి నుంచి ఆనందపురం హైవేలో ప్రయాణిస్తున్న వీరి కారు పెందురి మండలంలోని రాంపురం సమీపంలో ముందు వెళ్తున్న వ్యాన్‌ని ఢీకొట్టింది. దీంతో కారు నుజ్జునుజ్జయింది. కారు డ్రైవింగ్ చేస్తున్న దొమ్మేటి సూర్య భగవాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పెందుర్తి ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్, లా అండ్ ఆర్డర్ ఎస్ఐ ఆసిరి తాత, ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ సంఘటన స్థలానికి సిబ్బందితో చేరుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. మృతుడు సూర్యభగవాన్ మృతదేహాన్ని పోస్టుమార్టంకి పంపించారు. క్షతగాత్రుల వద్ద ఉన్న ఆధారాలతో కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కాగా మంగళవారం ఉదయానికే చేరుకున్న క్షతగాత్రుల కుటుంబీకులు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కాకినాడకు తీసుకెళ్లిపోయారు. వీరిలో సాయికృష్ణ పరిస్థితి విషమంగా ఉన్నట్టు పోలీసులు తెలిపారు. కాగా పోస్టుమార్టం పూర్తికాగానే సూర్యభగవాన్ మృతదేహాన్ని కూడా వారి బంధువులకు అప్పగించారు. ఇదిలావుండగా ప్రమాదం జరిగిన వెంటనే వ్యాన్ డ్రైవర్ భయంతో పారిపోయాడు. కాగా కారులో బీర్ బాటిళ్లు లభ్యమవడంతో వీరంతా డ్రింక్ చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. అలాగే ప్రమాదానికి మితిమీరిన వేగం కూడా కారణమై ఉండవచ్చని కూడా భావిస్తున్నారు. ప్రమాద సమయంలో వీరి కారు 140 కిలోమీటర్లు వేగంతో వెళ్తున్నట్టు పరిశీలనతో తేలింది. అలాగే ప్రమాదస్థలంలో వ్యాన్ ఆగి ఉన్నట్లు పలువురు చెబుతుండటంతో ఆ కోణంలో కూడా పరిశీలన చేస్తున్నారు. సీఐ శ్రీనివాసరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

దోమల నియంత్రణకు చర్యలు



వీధుల్లో ఫాగింగ్ చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

అనకాపల్లిటౌన్: పట్టణంలో దోమల నియంత్రణకు జీవీఎంసీ అధికారులు మంగళవారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. 82, 83వ వార్డుల్లో జెడ్సీ చక్రవర్తి ఆదేశాల మేరకు ప్రజారోగ్య విభాగం సిబ్బంది వీధుల్లో ఫాగింగ్, మురుగునీటి కాలువల్లో దోమల మందు పిచికారీ చేశారు. సీజనల్ వ్యాధులతోపాటు డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, విషజ్వరాలు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా దోమలను నియంత్రణకు చర్యలు తీసుకున్నట్లు జీవీఎంసీ సిబ్బంది తెలిపారు.

కశింకోటలో 'గడప గడపకు' నేడు

కశింకోట: స్థానిక 3వ సచివాలయ పరిధిలో బుధవారం ఉదయం 8 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో వి.వి.రవికుమార్ తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరై, ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, బ్రోచర్లను అందిస్తారని పేర్కొన్నారు. అధికారులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, అభిమానులు, ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని వినతి



డీఆర్వో అనితకు వినతిపత్రం అందిస్తున్న మాణిక్యాలరావు, లక్ష్మణ

తుమ్మపాల: జిల్లాలో వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని బీఎస్పీ నేత సూది కొండ మాణిక్యాలరావు మంగళవారం కలెక్టరేట్‌లో డీఆర్వో అనితకు వినతిపత్రం అందించారు. సాంఘిక సంక్షేమ శాఖ విద్యార్థులు ప్రైవేటు భవనాల్లో అరకొర వసతులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆయన వెంట సీపీఐ నాయకుడు కోన లక్ష్మణ ఉన్నారు.

అనకాపల్లి సినిమాలు

బేబి	: రాజా
ఏం చేస్తున్నావ్	: సత్యనారాయణ స్క్రీన్-1
దక్ష	: సత్యనారాయణ స్క్రీన్-2
జైలర్	: షిర్డిసాయి
కింగ్ ఆఫ్ కోథా	: పర్తిసాయి
గాండీవధారి అర్జున	: వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	: శ్రీసత్య
బెదురులంక 2012	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 167 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,280	4,470
రెండో రకం	4,130	4,160
మూడోరకం	3,800	3,970

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 38 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-13 యూనిట్లు, ఓ పాజిటివ్-19 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 391 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 437 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

ప్రకృతి సేద్యం.. బతుకు భద్రం

- పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువ
- ప్రకృతి వ్యవసాయంపై రైతుల ఆసక్తి
- ఏటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం

ఒకప్పుడు వ్యవసాయం కేవలం ఆహారం కోసమే. ఇప్పుడు వ్యవసాయం కూడా వ్యాపారమే. కొన్ని పంటల దిగుబడి పెరిగేందుకు రసాయన ఎరువులు, పురుగు మందులను విరివిగా వినియోగిస్తున్నారు. ప్రజలు వాటినే కొనుగోలు చేసి, తిని అనారోగ్యం పాలవుతున్నారు. క్రమేపీ రసాయన రహిత, ప్రకృతి సేద్యపు ఉత్పత్తులపై ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. రైతులు కూడా అదే బాటలో పంటలు పండిస్తూ, మెరుగైన ఆదాయం ఆర్జిస్తున్నారు.

తుమ్మపాల: ఆహారం విషయంలో ప్రజల్లో మార్పు వచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా రసాయన రహిత పంటల్ని ప్రోత్సహిస్తోంది. దీంతో ప్రకృతి వ్యవసాయం రైతుల్ని ఆకర్షిస్తోంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ అదాయం, ఆరోగ్యకర పంటలు లభిస్తుండటంతో ప్రకృతి వ్యవసాయంపై రైతులు మొగ్గు చూపుతున్నారు. రసాయన, క్రిమిసహార మందులకు స్వస్తి పలికి, ఈ విధానంలో మంచి లాభాలను పొందుతున్నారు.

2,495 ఎకరాల్లో ప్రకృతి సేద్యం

మండలంలోని 13 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఎక్కువగా మక్కువ చూపిస్తున్నారు. రసాయన రహిత జీవన ఎరువుల వినియోగంతో ఆరోగ్యకర పంటలను పండిస్తున్నారు. మండలంలో 2,685 మంది రైతులు 2,495 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. గత ఏడాది 1,800 ఎకరాల్లో ప్రకృతి సేద్యం జరిగింది.



ప్రకృతి వ్యవసాయంలో వరి నాట్లు వేస్తున్న రైతులు

ఈ విస్తీర్ణం ఏటా పెరుగుతోంది. శతశాతం ప్రకృతి వ్యవసాయంపై రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలందిస్తోంది. గ్రామాల్లో సదస్సులు ఏర్పాటుచేసి రైతులకు అవగాహన కల్పిన్నారు. పండ్ల తోటలతో పాటు వరి, చెరకు, పలు రకాల కూరగాయలను ఈ విధానంలో ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈ సీజన్‌లో 50 శాతం మేర వరి పంటే ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగవుతోంది.

పొలంబడితో అవగాహన

మండలంలో ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అవగాహన కల్పించేందుకు పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పరుగు మందులు, తెగుళ్ల నివారణలో మెళకువల్ని నేర్పుతున్నారు. గ్రామ సంఘాల ద్వారా సేంద్రియ ఎరువులను తయారుచేసి రైతులకు సరఫరా చేస్తున్నారు. కషాయాలు, గోమూత్రంతో పంచ గవ్య, అగ్నిఅస్త్రం, బ్రహ్మాస్త్రం, నవధాన్యాల కిట్లు, లింగాకర్షణ బుట్టలు, వేపపిండి, ఇంగువ ద్రావణం తదితరాల సరఫరా, తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకు మండలంలో 25 మంది వరకు సిబ్బంది పనిచేస్తున్నారు.



పంటలను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది

ప్రకృతి సేద్యానికి ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది. గతంలో ఎప్పుడూ ఇంతగా అధికారులు మా దగ్గరికి వచ్చి, పంటల సాగులో మెళకువల్ని చెప్పిన దాఖలాల్లేవు. ఇపుడు ప్రతి దశలోనూ పొలం దగ్గరికే వారు వస్తున్నారు. పంట పరిస్థితిని తెలుసుకుంటున్నారు. జీవన ఎరువుల్ని కూడా సరఫరా చేస్తున్నారు. స్వయంగా తయారు చేసుకునేలా నేర్పుతున్నారు.

– విల్లూరు శ్రీనివాసరావు, రైతు, దిబ్బపాలెం

ఎరువుల తయారీపై అవగాహన

ప్రకృతి వ్యవసాయంలో జీవన ఎరువులైన ఘన జీవామృతం, ద్రవ జీవామృతం వంటివి తయారుచేసి రైతులకు సరఫరా చేస్తున్నాం. గ్రామాల్లో రైతులను ప్రోత్సహించి రైతుల కల్లాల్లోనే వీటిని తయారుచేస్తున్నాం. పొలంబడి కార్యక్రమాల ద్వారా రైతుల్లో ఎరువుల తయారీపై అవగాహన పెంచుతున్నాం. దీంతో ఏటా ప్రకృతి సేద్యం వైపు రైతుల ఆసక్తి పెరుగుతోంది.

– మజ్జి సత్యారావు, మండల ఇన్‌చార్జి

క్రీడలకు సీఎం జగన్ పెద్దపీట

డైట్ కళాశాలలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

తుమ్మపాల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలకు పెద్దపీట వేస్తున్నారన్నారని డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ అన్నారు. డైట్ కళాశాలలో మంగళవారం జ్యోతి ప్రజ్వలన చేసి జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమాలను ప్రారంభించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడల్లో ప్రతిభతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలను కైవసం చేసుకోవచ్చన్నారు. క్రీడారంగంలో అనకాపల్లి మంచి గుర్తింపు ఉందన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ ప్రభుత్వంలో మాజీ దాడి వీరభద్రరావు ఆధ్వర్యంలో మొదటిసారిగా జాతీయస్థాయి ఖోఖో పోటీలు నిర్వహించిన ఘనత అనకాపల్లికే దక్కిందన్నారు. క్రీడలను మరింతగా ప్రోత్సహించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు ఆయన జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులను సత్కరించారు.



సత్కారం పొందిన క్రీడాకారులతో దాడి రత్నాకర్ గుర్తింపు పొందిన క్రీడాకారులు, అధ్యాపకులు

కార్యక్రమంలో ఒలింపిక్ వెయిట్ లిఫ్టర్ ఎంపీ మాణిక్యాలు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత, ఇండియన్ బాక్సింగ్ టీమ్ కోచ్ ఐ.వెంకటేశ్వరరావు, అంతర్జాతీయ వెయిట్‌లిఫ్టర్, విశాఖ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కె.సూర్యనారాయణ, బాడీబిల్డర్లు ఎన్.మారునాయుడు, శిలపరశెట్టి బాబీ, డీఎస్‌డీవో ఎల్.రమణ, కళాశాల ప్రిన్సిపల్ ఆర్.వైకుంఠరావు, విశాఖ స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి మోహన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా మరిడిమాంబ సారె ఊరేగింపు

అనకాపల్లిటౌన్: స్థానిక కోట్నివీధి మరిడిమాంబ అమ్మవారి సారె ఊరేగింపు మంగళవారం నేత్రపర్వంగా సాగింది. ఆలయ పరిసర ప్రాంతాల మహిళలు పలు రకాల పిండివంటలు తయారు చేసి ఆలయం వద్దకు తీసుకొచ్చారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కార్యదర్శి కోరుకొండ రాఘవ ఆధ్వర్యంలో మహిళలు పిండి వంటల పళ్లాలు తలపై పెట్టుకుని చుక్కల వీధి, మళ్లవీధి, బ్రాహ్మణవీధి, కోట్నినగర్, లక్ష్మీనారాయణనగర్, కొణతాలవారివీధి, సరిసావీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి సారెను నివేదించి భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కోట్ని శ్రీనివాసరావు, కోట్ని కొండలరావు, ధర్మకర్తలు అలం ప్రసాద్, కోరుకొండ వాసు, సీతా నూకరాజు, కె.నాగరాజు, లక్కిడపు స్వప్న, కేతిరెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సారె ఊరేగింపులో పాల్గొన్న మహిళా భక్తులు

నూతన డ్రైనేజీ పనుల పరిశీలన

అనకాపల్లిటౌన్: స్థానిక శారదా కాలనీలో నూతనంగా నిర్మించిన డ్రైనేజీలను వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మంజూరు చేసిన రూ.కోటి నిధులతో కాలువలను నిర్మించినట్లు తెలిపారు. 82వ వార్డులో కార్పొరేటర్ మందపాటి సునీత మంజూరు చేసిన పనులను మంత్రి అమర్‌నాథ్ సహకారంతో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి గైపూరి రాజు, పార్టీ శ్రేణులు గొన్నాబత్తుల రమణ, డానీ, కోరుకొండ శివ, జాజ్‌విల్సన్, చంద్రశేఖర్, డాక్టర్ మజ్జి అప్పలనాయుడు, దేవుళ్ల, తాకాశి ప్రసాద్, వానపల్లి శ్రీనివాసరావు, కె.వాసు, గౌస్, ఆలిరాజ్ పాల్గొన్నారు.



కాలువ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జానకీరామరాజు

దిలీప్ కుమార్‌కు అభినందన సత్కారం

అనకాపల్లి రూరల్: ఆంధ్రప్రదేశ్ ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ(ఏపీఐడబ్ల్యూఏ) చైర్మన్‌గా నియమితులైన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్‌ను మంగళవారం తుమ్మపాల గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు ఘనంగా సత్కరించారు. ఆయన నివాసానికి వెళ్లిన సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి, విల్లూరి చంద్రశేఖర్, ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు, అశోక్, దంతులూరి కళ్యాణ్ చక్రవర్తి, ఉప సర్పంచ్ చదరం చిన్న, వార్డు సభ్యులు జెర్రిపోతుల శ్రీలక్ష్మి, పట్నాల రాజేశ్వరి, వెలగా మోదినాయుడు, కొణతాల అర్జున్ నాయుడు, ముత్యాల వెంకటలక్ష్మి, కండెల్లి గోవిందమ్మ, కొయ్య భాస్కరరావు, అంగులూరి సత్యనారాయణ, తర సత్యారావు, యనమశెట్టి రామారావు, పీలా బుజ్జి, ఆర్టీసీ సత్యనారాయణ, జీపీ నాయుడు, గొంతిన శ్రీను తదితరులు వెళ్లి పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు.



దిలీప్ కుమార్‌ను సత్కరిస్తున్న తుమ్మపాల సర్పంచ్ పెంటయ్య నాయుడు, వైఎస్సార్‌సీపీ నేతలు

డీపీఎన్ స్కూల్‌కు క్రీడా ప్రతిభా పురస్కారం

కశింకోట: స్థానిక డీపీఎన్ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు జిల్లా క్రీడా ప్రతిభా పురస్కారం లభించింది. మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా స్కూల్ హెచ్‌ఎం ఎం.ఆర్.అప్పారావు, పీడీ వేదుల ప్రభాకరరావులకు జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందించారు. జిల్లాలో స్కూల్ గేమ్స్ నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఐదు పాఠశాలలను ప్రాధాన్యతా క్రమంలో పురస్కారాలకు ఎంపిక చేశారు. ఇందులో డీపీఎన్ స్కూల్ నాలుగో స్థానం నిలిచింది. డీఈవో వెంకటలక్ష్మమ్మ, స్కూల్ ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు.



క్రీడా ప్రతిభా పురస్కారం అందిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

83వ వార్డులో అభివృద్ధి పనులకు శ్రీకారం నేడు

అనకాపల్లిటౌన్: పట్టణంలో 83వ వార్డు పరిధిలో పలు అభివృద్ధి పనులకు బుధవారం రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శంకుస్థాపన చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అంతకు ముందు స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో మంత్రి అమర్‌నాథ్ పార్టీ శ్రేణులతో సమావేశమవుతారని పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ హాజరుకానున్నట్లు వెల్లడించారు.

విద్యార్థి దశ నుంచే దేశభక్తి అలవర్చుకోవాలి

సబ్బవరం: విద్యార్థి దశ నుంచే దేశభక్తిని అలవర్చుకోవాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి తెలిపారు. మండలంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మంగళవారం నా భూమి–నా దేశం కార్యక్రమంలో భాగంగా భారీ అవగాన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో భారత సైనిక దళాలల్లో సేవలందిస్తున్న జవాన్లను ఘనంగా సన్మానించడం జరుగుతుందన్నారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి స్వాతంత్య్ర సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, తరాక ప్రసాద్, వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము, ఎంపీడీవో రమేష్ నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ మురళీధర్, వైస్ ప్రిన్సిపాల్ పీవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి తదితరులు

ఘనంగా క్రీడా, తెలుగు భాషా దినోత్సవాలు



క్రీడల్లో గెలుపొంది బహుమతులు అందుకున్న విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

కశింకోట: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో క్రీడా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలు పిరమిడ్ ఆకారంలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తూ విన్యాసాలు చేశారు. ఇవి ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, రన్నింగ్, లెమన్ అండ్ స్పూన్, హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్‌పై వ్యాస రచన తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. తెలుగు భాషా దినోత్సవాన్ని కూడా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, పద్య పఠన పోటీలు నిర్వహించారు. విజేతలకు హెచ్‌ఎం ఎం.ఎస్.స్వర్ణకుమారి బహుమతులు అందించారు. కార్యక్రమాల్లో విద్యా కమిటీ చైర్మన్ యల్లపు శ్రీనివాసరావు, పీడీ పెంటకోట కమల, తెలుగు ఉపాధ్యాయులు శకుంతల, చామంతి, అనిత, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తుమ్మపాల: ప్రముఖ కవి గిడుగు రామ్మూర్తి పంతుల కృషితో తెలుగు భాష ఔన్నత్యం ప్రపంచానికి తెలిసిందని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం అన్నారు. స్థానిక వన్‌వే ట్రాఫిక్ జంక్షన్ తెలుగు తల్లి విగ్రహం వద్ద అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషకు అంతర్జాతీయ గుర్తింపు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అంతకు ముందు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వినకోట నీలేశ్‌గుప్త, కార్యవర్గ సభ్యులు రొబ్బి మల్లేశ్వరరావు, పట్నాల కృష్ణమోహన్, బూడిద జోగారావు, పాముల గోపి పాల్గొన్నారు.



కశింకోట బాలికల హైస్కూలులో పిరమిడ్ విన్యాసంలో విద్యార్థినులు

తుమ్మపాల: స్థానిక జీవీఎంసీ గాంధీనగరం ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమాలు మంగళవారం ఘనంగా జరిగాయి. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సూర్యకృష్ణ మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి ఔన్నత్యాన్ని, హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ క్రీడాప్రతిభను విద్యార్థులకు వివరించారు. అంతకుముందు గత ఏడాది రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన పి.ధనుష్‌కు జ్ఞాపిక అందించి, క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అబ్దుల్‌కలాం సేవాసంస్థ వ్యవస్థాపకుడు ఆళ్ల ప్రవీణ్‌కుమార్, సభ్యులు విజేతలను మెడల్స్‌తో అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- సాయిశక్తి పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ అన్నం రాజశేఖర్ తెలుగు భాష ప్రాధాన్యతను వివరించారు. అంతకుముందు విద్యార్థులు తెలుగుతల్లి, ఇతర ప్రముఖుల వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జి.రంగబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.




తెలుగుతల్లి విగ్రహం వద్ద అసోసియేషన్ సభ్యులు

తెలుగు భాషకు వెలుగునిచ్చింది గిడుగు

– జిల్లా అదనపు ఎస్పీ సత్యనారాయణ

అనకాపల్లిటౌన్: వ్యవహారిక భాషోద్యమకర్త గిడుగు రామ్మూర్తి కృషితో తెలుగు భాష విశ్వవ్యాప్తమయిందని జిల్లా అదనపు ఎస్పీ పి.సత్యనారాయణ అన్నారు. మంగళవారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్పీ కార్యాలయంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాష కఠినమైన గ్రాంథిక రూపంలో ఉండేదని, దాన్ని వ్యవహారిక భాషగా మార్చి, అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చిన వ్యక్తి గిడుగు రామ్మూర్తి అని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్‌ఐలు వెంకన్న, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



గాంధీనగరం పాఠశాలలో ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



తెలుగుతల్లి, ప్రముఖుల వేషధారణలో విద్యార్థులు



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఏఎస్పీ సత్యనారాయణ

అవి సీసీ రోడ్లు కాదు డ్రైనేజీ పనులు

అనకాపల్లి టౌన్: పూడిమడక రహదారి కూడలిలో నూతన డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ఉమ్మలాడ మాజీ సర్పంచ్ కర్రి భాస్కరరావు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సర్వే నెం.767/1లో కాలువ పనులు చేపడుతుంటే.. కొంతమంది అవగాహన రాహిత్యంతో సిమెంట్ రోడ్డు నిర్మిస్తున్నట్లు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆక్షేపించారు. ఈ విషయంలో అధికారులపై చేస్తున్న ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు.

ఘనంగా ఓనం, తెలుగు భాషా దినోత్సవం

సబ్బవరంలోని బ్రైట్‌వైన్స్ పాఠశాలలో ఓనం పర్వదినం, తెలుగు భాషా దినోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ ఎలీసా, ప్రిన్సిపాల్ పునీత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కేరళ సంప్రదాయ వస్త్రధారణలో ఆకట్టుకున్నారు. – సబ్బవరం



నేడు బీటీ రోడ్లకు శంకుస్థాపన

అనకాపల్లిటౌన్: జీవీఎంసీ 80వ వార్డులో బీటీ రోడ్ల నిర్మాణానికి బుధవారం రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శంకుస్థాపన చేయనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలో రూ.2.47 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కేఎస్ఆర్ పేట నుంచి రాజుపాలెం సూర్యనారాయణస్వామి దేవస్థానం రహదారికి రూ.కోటీ 28 లక్షలు, రాజుపాలెం నుంచి వల్లూరు గ్రామ రహదారికి రూ.కోటి 19 లక్షలు మంజూరైనట్లు తెలిపారు.

'దేవస్థానం భూముల్ని అన్యాక్రాంతం చేయొద్దు'

తుమ్మపాల: మండలంలోని సత్యనారాయణపురం పంచాయతీ హేమగిరి శ్రీ రామలక్ష్మి సమేత సత్యనారాయణస్వామి దేవస్థానానికి చెందిన ఖరీదైన భూములను రియల్టీ వ్యాపారులకు అప్పగించేందుకు చేస్తున్న ప్రయత్నాలను నిలిపివేయాలని అఖిలపక్ష, ప్రజాసంఘాల నేతలు ఆర్డీవో చిన్నికృష్ణను మంగళవారం ఆయన కార్యాలయంలో కలిసి విన్నవించారు. కశింకోట నుంచి బంగారుమెట్ట రహదారికి ఆనుకుని ఉన్న సత్యనారాయణస్వామి దేవస్థానం భూములను అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. వినతి పత్రం అందించిన వారిలో సీపీఐ జోనల్ కార్యదర్శి వైఎన్ భద్రం, మాజీ కౌన్సిలర్ తాకాశి వెంకటేశ్వరరావు, ఆప్ కన్వీనర్ కొణతాల హరనాథబాబు, బీజేపీ నాయకులు మోహన్‌రావు, ఎన్జీవో నాయకుడు మళ్ల చక్రవర్తి తదితరులున్నారు.

కుటుంబ తగాదాలతో వ్యక్తి ఆత్మహత్య

పరవాడ: దేశపాత్రునిపాలెం ఆర్ఆర్ నగర్‌లో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ వ్యక్తి ఒడిశా ప్రాంతానికి చెందిన కబీ బొండా బాన్ (36)గా సీఐ పి.ఈశ్వరరావు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. మృతుడు భార్య, ఇద్దరు పిల్లలతో దేశపాత్రునిపాలెం దరి ఆర్ఆర్ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. మంగళవారం ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్యలో ఇంట్లో పడక గదిలో ఇన్‌సైడ్ బోల్టుకు ఉరివేసుకొని బాన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి ఆత్మహత్యకు కుటుంబ తగాదాలే కారణమని పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించి. కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నామని సీఐ చెప్పారు.